'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ప్రాజెక్టులు కేంద్రార్పణం?

**కృష్ణానది** ప్రాజెక్టుల నిర్వహణ క్రమంగా గందరగోళంలో పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా తనకే అప్పగించాలని కేంద్రం పట్టుదలగా ఉన్నది. ఇందుకు ఆంధ్రప్రదేశ్ తనవైన కారణాలతో పూర్తి అంగీకారం తెలిపింది. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఊగిసలాట ధోరణిలో పోతున్నది. కేంద్రం ఒత్తిడిని కేసీఆర్ ప్రభుత్వం మొదటి నుంచీ తీవ్రంగా ప్రతిఘటించడం తెలిసిందే. ఈనెల 17న కేంద్ర జల్ శక్తి శాఖ ఇరురాష్ట్రాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసింది. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులు, వాటికి సంబంధించిన మొత్తం 15 ఔట్‌లెట్లు కృష్ణానదీ యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)కి అప్పగించాలని ఆదేశించింది. ముందుగా యావత్తు నిర్వహణను బోర్డుకు అప్పగించాలని, ఏవైనా అభ్యంతరాలుంటే తర్వాత పరిష్కరిస్తామని చెప్పింది. అందుకు ఏపీ సర్కారుతో పాటుగా తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పుకొన్నట్టు మినిట్స్‌ను జల్ శక్తి శాఖ విడుదల చేసింది. కేంద్రం తాఖీదుకు రాష్ట్రప్రభుత్వం తలవంచిందనే వార్తలపై రాష్ట్రంలో సహజంగానే ఆందోళన వ్యక్తమైంది. తెలంగాణవాదులు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా విమర్శించారు. అయితే కొత్త ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు ఒకడుగు ముందుకు రెండడుగులు వెనక్కి అన్నట్టుగా ఉండటం తెలిసిందే. తాజాగా ప్రాజెక్టుల అప్పగింతపై కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ధోరణి అదేతీరుగా ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలో ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పుకోలేదని రాష్ట్ర ప్రభుత్వం ఖండించింది. మినిట్స్‌లో సమాచారం సరిగ్గా ఇవ్వలేదని అంటున్నది. ఈ అంశంపై తీసుకోవాల్సిన నిర్ణయంపై తర్జనభర్జనలు చేస్తున్నదని, త్వరలో లేఖ రాయనున్నదని తెలియవస్తున్నది. అయితే వీటన్నిటితో ప్రమేయం లేకుండా ప్రాజెక్టుల స్వాధీనానికి కేఆర్ఎంబీ సమాయత్తమవుతున్నట్టు వార్తలు వెలువడుతుండటం ఆందోళన కలిగిస్తున్నది. ఈ ప్రక్రియ పూర్తయితే రాష్ట్రం ఆగమైపోతుంది. సాగునీరు, తాగునీరు అవసరాలకు కేఆర్ఎంబీ నిర్ణయాలపైనా, కేంద్రం దయాదాక్షిణ్యాలపైనా ఆధారపడాల్సిన పరిస్థితి వస్తుంది. విద్యుత్తు ఉత్పత్తిపై అజమాయిషీ కూడా మన చేజారిపోతుంది. ట్రిబ్యునల్ అవార్డును పట్టించుకోకుండా ఏడేండ్ల వినియోగాన్ని బట్టి రూపొందించిన రూల్ కర్వ్ ఇప్పుడు కేంద్రం పెత్తనం కింద అమలులోకి వస్తే రాష్ట్ర నీటిహక్కులకు తీవ్ర విఘాతం ఏర్పడుతుంది. పైగా ఏపీ అక్రమ నీటి తరలింపును అడ్డుకునే మార్గం మనచేతుల్లో ఉండదు. గత నవంబర్‌లో రాష్ట్రంలో ఎన్నికల సందడి నడుమ సడేమియా అన్నట్టుగా సాగర్ ప్రాజెక్టు ఆక్రమణకు ఏపీ తెగించిన సంగతి గుర్తుంచుకోవాలి.

కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడం అంటే మన హక్కులను చేజేతులా కోల్పోవడమేననేది కేసీఆర్ ప్రభుత్వ వాదనగా ఉండింది. ఆ దృష్టితోనే ప్రాజెక్టుల నిర్వహణకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) రూపొందించిన రూల్ కర్వ్, ఆపరేషన్ ప్రొటోకాల్‌పై రిజర్వాయర్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఆర్ఎంసీ) సిఫార్సులను తీవ్రంగా వ్యతిరేకించింది. కృష్ణాజలాల్లో మన వాటాకు, కొత్త ప్రాజెక్టులకు సమస్యలు ఎదురవుతాయనేది బీఆర్ఎస్ వాదన. కానీ, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చీరాగానే అవగాహన లేకుండా, ఓ వ్యూహాన్ని రూపొందించుకోకుండా ప్రాజెక్టులు కేంద్రం చేతుల్లోకి వెళ్లేలా వ్యవహరించడం రాష్ట్ర ప్రయోజనాలకు భంగకరమని చెప్పకతప్పదు. ప్రభుత్వం ఇప్పటికైనా తన విధానాలను తగినవిధంగా సమీక్షించుకుని, సవరించుకొని అడుగులు వేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.

## అభివృద్ధిపై చర్చించాల్సిన సమయమిది

*రాముడు ఏ పార్టీకో, వ్యక్తికో చెందిన ఆస్తి కాదు. అందరికీ చెందినవాడు. రామమందిర కార్యక్రమం ముగిసింది. ఇక అభివృద్ధిపై చర్చించాల్సిన సమయమిది. ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని బీజేపీ హామీ ఇచ్చింది. మరి ఆ ఉద్యోగాలెక్కడ? గడిచిన పదేండ్లలో మీరు ఏం చేశారో చర్చిద్దామా?*

**- ఉద్ధవ్ ఠాక్రే,** *శివసేన (యూబీటీ) అధ్యక్షుడు*

## అయోమయంలో ప్రజాపాలన

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీల లబ్ధిదారుల ఎంపికకు తెలంగాణ ప్రభుత్వం ఇటీవల దరఖాస్తులు స్వీకరించిన విషయం తెలిసిందే. అభయహస్తం గ్యారంటీలకు 1.25 కోట్ల మంది దరఖాస్తు చేసుకున్నారు. అభయహస్తం గ్యారంటీల్లో మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తు చేసుకున్న కోటిమందికి పైగా మహిళలు ఎంతో ఆత్రుతతో ఎదురు చూస్తున్నారు. అదే సమయంలో ఈ పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వ చిత్తశుద్ధిపై దరఖాస్తుదారుల్లో అనేక అనుమానాలు ఉన్నాయి. స్పష్టత లోపించిన దరఖాస్తు ఫారం, డాటా ఎంట్రీలో నిర్లక్ష్య వైఖరి, ఇప్పటివరకు విడుదలకాని నియమనిబంధనలే దీనికి ప్రధాన కారణం.

మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.2,500 ఆర్థిక సాయం అందించేందుకు వీలుగా మహిళల బ్యాంకు ఖాతా వివరాలు అడగలేదు. దాంతో ఆర్థిక సాయం బ్యాంకుల ద్వారా చేస్తారా? లేక స్వయంగా లబ్ధిదారుల చేతికి ఇస్తారా? అనేది ఇప్పటివరకు స్పష్టత రావడం లేదు. కుటుంబంలోని మహిళలందరికీ ఇస్తారా? లేక ఒకరికి మాత్రమే అమలు చేస్తారా? వృద్ధాప్య పింఛన్ వస్తున్న వారి కుటుంబంలోని ఇతర మహిళలకు ఇస్తారా? లేదా? అనే అనుమానాలు ఉన్నాయి. రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇచ్చే పథకానికి సంబంధించి గ్యాస్ బిల్ మాత్రం అడగలేదు. ఏడాదికి అవసరమైన సిలిండర్లు అన్నీ రూ.500కే ఇస్తారా? పరిమిత సంఖ్యలో ఇస్తే ఎన్ని సిలిండర్లు ఇస్తారు? అనేది ప్రభుత్వం తెలియజేయడం లేదు.

రైతు భరోసా, కౌలుదారులు, వ్యవసాయ కూలీలు, ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం విషయంలోనూ గందరగోళం నెలకొన్నది. ఇంటి స్థలం లేని వారిని ఇందిరమ్మ ఇండ్ల పథకానికి విస్మరించడం దురదృష్టకరం. ప్రభుత్వం హామీ ఇవ్వడంతో డిసెంబర్ నుంచే విద్యుత్తు బిల్లులు చెల్లించడం లేదు. ఇప్పటినుంచే విద్యుత్తు బిల్లులు చెల్లించవద్దని ఎన్నికల సమయంలో రేవంత్‌రెడ్డి చేసిన ప్రచార వీడియోలు ఇప్పుడు సోషల్‌మీడియాలో తెగ చక్కర్లు కొడుతున్నాయి. దరఖాస్తుతో పాటు ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్ కాపీలు మాత్రమే తీసుకున్నారు. వాటితోనే అన్ని గ్యారంటీలకు లబ్ధిదారులను ఎలా ఎంపిక చేస్తారో అంతుచిక్కడం లేదు. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేవరకు కాలయాపన చేసేందుకు దరఖాస్తులు స్వీకరించారనే విమర్శలు వస్తున్నాయి. ఇకనైనా విధివిధానాలపై స్పష్టత ఇవ్వాలి. అర్హులైన వారందరికీ సంక్షేమ లబ్ధి అందించాలి.

*- కైలసాని శివప్రసాద్*

# ఉక్రోషంతో ఉత్తర ప్రగల్భాలు

డాక్టర్ ఆంజనేయగౌడ్

**పార్లమెంట్ ఎన్నికలు పలువురి నోటి వెంట శపథాలు చేయిస్తున్నాయి. స్థల, కాలాలను కానకుండా, కన్నుమిన్నూ ఎరుగని రీతిలో కొందరు నోటికొచ్చింది వాగేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిసినా, అధికారం దక్కి పీఠమెక్కినా ఏదో అభద్రతా భావన, తరుముతున్న వేదన హస్తం పార్టీ నేతలను నిద్రకు దూరం చేస్తున్నట్టుగా ఉన్నది. లేకపోతే ఇలా వారెందుకు రెచ్చిపోతారు? విదేశీ గడ్డపై హుందాతనాన్ని గాలికొదిలేసి, సినిమాలలో బాలకృష్ణలా తొడకొట్టే డైలాగ్‌లు అందుకోవడం వెనుక సీఎం రేవంత్‌లో ఉన్న కలవరం బట్టబయలైపోయింది.**

బీఆర్ఎస్‌ను బొందపెడతామనే గజకర్ణ, గోకర్ణ ఘీంకారం వెనుక ముఖ్యమంత్రి గందరగోళ స్థితి అందరికీ కనిపిస్తూనే ఉన్నది. బహుశా ఢిల్లీ పెద్దలకు రాబోతున్న పార్లమెంట్ ఎన్నికల కోసం బాకీపడ్డవి, తెలంగాణ ప్రజలకు బాకీపడ్డ ఆరు గ్యారంటీలు, 420 హామీలు.. ఇలా ఏవేవో రేవంత్‌రెడ్డికి టెన్షన్‌ను కలిగిస్తున్నట్టున్నాయి. దానివల్లనే ఏమో మారిన మనిషిలా కనిపించాలని ఎంత ప్రయత్నం చేస్తున్నా, ఉక్రోషాన్ని పంటిబిగువున పట్టలేక పడరాని పాట్లు పడుతున్నారు.

> **'కడుపులో కత్తులు, నోట్లో బెల్లం' సీరియల్‌ను కలిసి పండిస్తున్న కాంగ్రెస్ క్యాబినెట్ సభ్యులు అందరూ, పోటీలు పడి స్టైనీ ప్రకటనలు చేసేస్తున్నారు. కోమటిరెడ్డి అయితే '39 ముక్కలు' మాటందుకున్నాడు. రెండు దశాబ్దాల కిందట జన తెలంగాణ కోసం స్వర భాస్వరమైన బెల్లి లలితను 17 ముక్కలుగా నరికేశారు. అలాగే నేడు స్వరాష్ట్ర అస్తిత్వమే ఆత్మగా కలిగిన గులాబీ జెండాను రాజకీయంగా 39 ముక్కలు చేస్తామని వాగుతుండటం ఎంత వెగటు పుట్టించే వెకిలి పలుకులో వారికి అర్థం అవుతుందని అనుకోలేం.**

దశాబ్దం తర్వాత దొరికిన అవకాశాన్ని హస్తం పార్టీ నేతలు ఎలా, ఏ లక్ష్యాల కోసం వినియోగిస్తున్నారో రాష్ట్ర ప్రజలు గమనిస్తూనే ఉన్నారు. వాస్తవానికి జాతీయ పార్టీలైన బీజేపీ, కాంగ్రెస్‌ల కుమ్మక్కు కుయుక్తిని బండి సంజయ్ కుండబద్దలు కొట్టినట్టుగా బహిరంగంగానే వెళ్లగక్కేశారు. ఆయన చాలా స్పష్టంగా 'మనం (కాంగ్రెస్, బీజేపీ) తలపడటం పక్కనపెట్టి ముందు బీఆర్ఎస్‌ను బొందపెడదాం' అని బండి కమలాన్ని చేతికి అందించారు. ఏడు దశాబ్దాలుగా దేశంలో అక్షరాలా జరుగుతున్నదే, నోరున్న బండి బట్టబయలుచేశారు. రాజకీయ నాణానికి బొమ్మా, బొరుసులా మారి, దేశం నుదిట మానని రాచపుండులా మారిన కాంగ్రెస్, బీజేపీ రాజకీయ వ్యవస్థను చదరంగంలా మార్చుకున్నాయి.

నినాదాలను జనాల కోసం, విధానాలను బడాబాబుల కోసం రూపొందిస్తూ, పడుతూ లేస్తూ, పడుతూ లేస్తూ నడిచే నత్తనడకను భారత్‌కు అంటగట్టారు. ఈ రెండు జాతీయ పార్టీల ఉమ్మడి రాజకీయ లక్ష్యం ద్విపాత్రాభినయం మాత్రమే. రాజకీయాలను వంతులవారి క్రీడగా మార్చుకొని, విస్తారం తెచ్చిపెట్టిన అహంకారంతో దశాబ్దాలుగా ఈ రెండు జాతీయ పార్టీలూ ప్రాంతీయ ఆకాంక్షలను పాతరపెట్టే ఎత్తులే వేస్తూ వస్తున్నాయి. దేశ రాజకీయ వ్యవస్థను లోతుగా అర్థం చేసుకున్న బుద్ధిజీవులెవరికైనా బండి, రేవంత్, కోమటిరెడ్డిల శకుని శపథాలు కొత్తగా అనిపించవు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి, రాష్ట్ర సర్కార్ వ్యవహారాలు 'ఓవర్ టూ ఢిల్లీ'లా మారిన తర్వాత ఇలాంటి రాజనీతిని తప్ప మరేమీ ఆశించజాలం. భారీ పరిమాణం, వైవిధ్య భరితమైన జనాభా, విభిన్న భౌగోళిక పరిస్థితులు కలిగిన భారతదేశాన్ని ఐక్యంగా, కలిపి కొనసాగించేందుకే రాజ్యాంగ నిర్మాతలు సమాఖ్య తరహా విధానాన్ని దేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు గీటురాయిగా రూపొందించారు. కానీ, ఇండియాయే ఇందిరా, ఇందిరాయే ఇండియా నినాదోన్మాదంతో కాంగ్రెస్ సర్కార్ సమాఖ్య స్ఫూర్తిని, ప్రాంతాల, ప్రజల ఆత్మ గౌరవాన్ని ఇనుప పాదాల కింద అణచే ప్రయత్నం చేసిన చరిత్రను, చెరసాలలే విపక్షాల చిరునామాలుగా మార్చేసిన నిన్నటి దుర్దినాలను ఏ బుద్ధిజీవి మాత్రం మరువగలడు? కాంగ్రెస్, బీజేపీల పొలిటికల్ డీఎన్ఏ ఒక్కటే. భారతదేశ రాజకీయ వ్యవస్థను ద్విముఖీన వీలైతే ఏక ముఖీన వ్యవస్థగా స్థిరపరచాలనేదే వాటి ఏజెండా. కానీ, ప్రాంతీయంగా ప్రజల ఆకాంక్షలు, అవస్థలు, ఆశయాలు ఈ రెండు జాతీయ పార్టీల కండ్లకు అసలే కానరావు. వైవిధ్యాల భారతదేశంలో విభిన్న చారిత్రక కారణాల వెలుగులో పురుడుపోసుకున్న ప్రాంతీయ పార్టీలది పవిత్రమైన చరిత్ర. ఆత్మగౌరవ పోరాటంతో స్వరాజ్యం తొలిరోజుల్లోనే తమిళనాట జెండా ఎగరేసిన ద్రవిడ మున్నేట్ర కజగం దగ్గర నుంచి అస్సాం అస్సామీయుల కోసమే నినాదంతో అస్సాం గణపరిషత్, సుఖ సిక్కిం లక్ష్యంతో సిక్కిం డెమోక్రటిక్ ఫ్రంట్, మా, మాతి, మనుష్ నినాదంతో తృణమూల్ కాంగ్రెస్.. ఇలా అనేక ప్రాంతీయ పార్టీల పుట్టుకలో ఎన్నో అపురూపమైన ఆకాంక్షలున్నాయి. అలాగే తెలంగాణ చరిత్ర, గులాబీ జెండా పుట్టుక, త్యాగం దేశ పార్లమెంటరీ వ్యవస్థకే కొత్త శోభను అద్దింది. బొంబాయి, దుబాయికి బతకపోవుడో లేక తిరగబడి అడవి బాట పట్టుడో తప్ప మరో మార్గం లేని తెలంగాణ యువతరానికి ఆశల దీపమై తొవ్వను పరిచింది బీఆర్ఎస్. ఇక్కడి భూమిపుత్రుల శాశ్వత రాజకీయ శక్తిగా గులాబీ పార్టీ ప్రతి గుండెల్లో స్థిరపడిపోయి ఉన్నది. ప్రాంతీయ పార్టీలను పొట్టనపెట్టుకోవాలనే ఉబలాటం దశాబ్దాలుగా కాంగ్రెస్, బీజేపీలకు ఉన్నదే. కానీ, అధికారానికి దూరమైనంత మాత్రాన గులాబీ జెండాను మింగేస్తామని కాంగ్రెస్ పార్టీ పాలకులు అనుకుంటే, ఆ పాపపు పనికి చేదోడుగా నిలుస్తామని కాషాయ పార్టీ పాలకులు కలలు కంటే అది వారి అవివేకమే అవుతుంది.

> **అసలు కేసీఆర్ జాతీయ స్థాయి రాజకీయ శక్తిగా టీఆర్ఎస్‌ను బలోపేతం చేయాలనుకున్నదే ఈ ప్రమాదాలకు ఎదురెళ్లేందుకు. తెలంగాణకు భవిష్యత్తులో ఎదురయ్యే రాజకీయ ఉపద్రవాలకు ఆనకట్టగా గులాబీ పార్టీని నిర్మించాలని ఆశించారు. సుదీర్ఘ రాజకీయ నేపథ్యం, నిరంతర, లోతైన అధ్యయనం కలిగిన కేసీఆర్‌కు, 'ఎడ్లెన్ని చచ్చినవనేది కాదు వడ్లెన్ని దక్కినవనే' నైజం గల కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీ విస్తరణ ఉన్మాదాన్ని నిలువరించజాలదనే వాస్తవం తెలుసు.**

తెలంగాణ రాష్ట్ర చారిత్రక గంగా జమునా తెహజీబ్ సంస్కృతికి భవిష్యత్తులో ఎదురయ్యే ఉన్మాదపు ఉత్పాతాన్ని స్పష్టంగానే అంచనా వేసుకున్న నాయకుడు కేసీఆర్. త్యాగాల పునాదులపై సాధించుకున్న స్వరాష్ట్రాన్ని, సుస్థిర, సమ్మిళిత అభివృద్ధిగా మార్చుకున్నాక, సామాజిక సంఘర్షణలకు తావులేని శాంతి నిలయంగా కలకాలం వర్ధిల్లేందుకు రాజకీయ కార్యాచరణను రూపొందించుకున్నారు. తెలంగాణ సౌభాగ్యం, శాంతి, సుస్థిరత ప్రాంతీయ రాజకీయ లక్ష్యంతోనే కాదు జాతీయ రాజకీయ బలాబలాలపై కూడా ఆధారపడి ఉన్నదనే నిజాన్ని కేసీఆర్ స్పష్టంగా అర్థం చేసుకున్నారు. ఈడీ, సీబీఐ లాంటి వ్యవస్థలతో విపక్షాలను వేటాడి, వేగంగా విస్తరిస్తుంటే, నిలువరించలేని నిరర్థక జాతీయ పార్టీగా కాంగ్రెస్ మారుతున్న స్థితిని అంచనా వేసుకున్నారు. కాంగ్రెస్, బీజేపీ ముఖాముఖి తలపడ్డ ప్రతి రాష్ట్రంలో కమలమే విజయం సాధిస్తూ, ప్రజాస్వామ్య వ్యవస్థకు వేగంగా ఉరితాడు పేనుతున్నది చూసే కేసీఆర్ అనివార్య స్థితిలో జాతీయ రాజకీయాల్లోకి అడుగులు వేయాలనుకున్నారు. తెలంగాణపై ముప్పు ముసురుకోకుండా, తానే తెలంగాణను శక్తిగా మలిచి ఎదురు నిలిచి, ఆ పార్టీలను వెనక్కు నెట్టేయాలనుకున్నారు. తెలంగాణ శాశ్వత ప్రయోజనాలకు, జాతీయ వర్తమాన లక్ష్యాలను జతకూర్చి జమిలీగా రాజకీయ ఆశయంగా నిలదొక్కుకోవాలనుకున్నారు. కానీ, తాను మునగడంతో పాటు నమ్మిన ప్రాంతీయ పార్టీలు, ప్రజలను ముంచే కాంగ్రెస్ పార్టీకి దేశ భిన్నత్వాన్ని బలివ్వడమే అలవాటు కదా? బీజేపీ పన్నిన వ్యూహంలో హస్తం పావుగా మారి తెలంగాణకు ముప్పును దగ్గరగా తెచ్చి పెట్టింది. చాలా తెలివిగా రాష్ట్ర రాజకీయాల్లోకి కాంగ్రెస్‌ను లాగి, జనపథ్ కుటుంబాన్ని మొత్తం తెలంగాణలోనే బొంగరంలా తిప్పి, కాంగ్రెస్ పార్టీకి ఉత్తరాదిన ఉన్న మూడు రాష్ట్రాలను బీజేపీ ఎగురేసుకుపోయింది. హస్తినలో మతితప్పిన ఎత్తులేస్తున్న హస్తం పార్టీ పెద్దలు ఇక ఏమాత్రం భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడలేరు. సమాఖ్య స్ఫూర్తి, లౌకికతత్వం, మత సామరస్యాన్ని కాంగ్రెస్ కాపాడుతుందని ఎవరైనా భ్రమిస్తే, కసాయిని నమ్మి గొర్రెల మంద వెంట అడుగులు వేసినట్టుగానే ఉంటుంది. అసలు బీజేపీ రాజకీయ ఎత్తుగడలను నిలువరించడం దేవుడెరుగు, కనీసం అర్థం చేసుకునే శక్తి కూడా కాంగ్రెస్ కేంద్ర నాయకత్వం కోల్పోయింది.

సుదీర్ఘ కాలం వాజపేయి, అద్వానీలు విభిన్న అభిప్రాయాలతో దేశంలో జుగల్బందీని నడిపించారు. ఇప్పుడు మోదీ, అమిత్‌షా ఏకాభిప్రాయంతో భిన్నాభిప్రాయాలను వధిస్తూ, విస్తరిస్తూ స్థిరపడిపోతున్నారు. రేపటి లోక్‌సభ ఎన్నికల్లో, దేశంలో కాంగ్రెస్ పార్టీ సాధించే ఫలితాలు బుద్ధిజీవులందరి ఊహకు అందనివేమీ కావు. దీపం పేరు చెప్పి చీకటి తొలగిపోతుందనే భ్రమను భారతదేశం అంతటా కల్పిస్తూ, కమలం పరుగులు తీస్తుంటే, హస్తం ఇంకా ఆదానీ చుట్టే, అర్థం కాని భాషతో అవస్థలు పడుతున్నది. కాంగ్రెస్ పార్టీ దేశాన్నే కాదు, మన త్యాగాల తెలంగాణను బీజేపీ ముప్పు నుంచి కాపాడలేదు. రాష్ట్ర హక్కులకైనా, సౌభ్రాతృత్వానికైనా గులాబీ జెండానే బలమైన అండ. తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ విలువలు, స్వరాష్ట్ర ఆకాంక్షలు ఎల్లకాలం ప్రజారాశుల అనుభవంలో ఉండాలంటే బీఆర్ఎస్ బలమైన రాజకీయ శక్తిగా ఉండి తీరాల్సిందే. వందల ఏండ్లుగా ఎన్నో గండాలను దాటుతున్న తెలంగాణ, మరో ముప్పును తిప్పికొట్టి తీరుతుంది. విషయ పరిజ్ఞానం ఉన్న కొంతమంది మేధావులు కావొచ్చు కానీ, మేధావులు అందరూ మంచివారు కాలేరు. ఏ నినాదాల వెనక, ఏ వర్గం ప్రయోజనాలు దాగి ఉన్నాయో ఆలోచనపరులందరూ అర్థం చేసుకోవాలి. బొంద పెడదామనే జాతీయ పార్టీల జాదూవేషాలను రాష్ట్ర పొలిమేరల్లోనే వేలాడదీయాలి.

> **తెలంగాణ సామాజిక పొందికే గులాబీ పార్టీ భావజాలం. నేల చారిత్రక ఆశయాలే బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు లక్ష్యాలు. ఎన్నో వర్గాల ప్రాతినిధ్య ఆశయం, ఎన్నో కలలకు దారిదీపం, చరిత్రకు వన్నె తెచ్చే పాత్రకు ప్రతిరూపం బీఆర్ఎస్. అది ముక్కలు కాదు.. మరో చరిత్ర సృష్టికి రగిలే జెండాలా రెపరెపలాడుతూనే ఉంటుంది.**

*వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర సోషల్ జస్టిస్ అథారిటీ మాజీ చైర్మన్*

> **రాష్ట్ర హక్కులకైనా, సౌభ్రాతృత్వానికైనా గులాబీ జెండానే బలమైన అండ. తెలంగాణ రాష్ట్రంలో రాజ్యాంగ విలువలు, స్వరాష్ట్ర ఆకాంక్షలు ఎల్లకాలం ప్రజారాశుల అనుభవంలో ఉండాలంటే బీఆర్ఎస్ బలమైన రాజకీయ శక్తిగా ఉండి తీరాల్సిందే. వందల ఏండ్లుగా ఎన్నో గండాలను దాటుతున్న తెలంగాణ, మరో ముప్పును తిప్పికొట్టి తీరుతుంది. విషయ పరిజ్ఞానం ఉన్న కొంతమంది మేధావులు కావొచ్చు కానీ, మేధావులు అందరూ మంచివారు కాలేరు. ఏ నినాదాల వెనక, ఏ వర్గం ప్రయోజనాలు దాగి ఉన్నాయో ఆలోచనపరులందరూ అర్థం చేసుకోవాలి.**

# స్ఫూర్తిదాయక జననేత కర్పూరీ ఠాకూర్

వెంకటకిషన్ ఇట్యాల
99081 98484

**బడుగు, బలహీన వర్గాల కోసం తన జీవితమంతా పోరాటం చేసిన ఓబీసీ నాయకుడు కర్పూరీ ఠాకూర్. ఆయనకు జననాయక్ అనే పేరు కూడా ఉంది. బీహార్ రాష్ట్రానికి రెండుమార్లు ముఖ్యమంత్రిగా సేవలందించారు. తన హయాంలోనే బీహార్‌లో సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేశారు. బీహార్‌లోని వెనుకబడిన ప్రాంతాల్లో ఆయన పేరు మీద అనేక పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. ప్రభుత్వ ఉద్యోగాల్లో వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్లు అమలు చేసిన ఘనత ఆయనది.**

లాలూ ప్రసాద్ యాదవ్, రాం విలాస్ పాశ్వాన్, దేవేంద్ర ప్రసాద్ యాదవ్, నితీష్ కుమార్ వంటి ప్రముఖ నేతలు ఆయనకు శిష్యులంటేనే కర్పూరీ ఠాకూర్ రాజకీయ జీవితం ఎంతటి ఆదర్శవంతమో అర్థం అవుతున్నది. అనేకమంది నేతలకు ఆదర్శప్రాయుడైన కర్పూరీ ఠాకూర్ శత జయంతిని నేడు మనం జరుపుకొంటున్నాం. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ప్రకటించి గౌరవించింది.

ఓబీసీల సంక్షేమం, సాధికారత కోసం అహర్నిశలు శ్రమించిన నేత జన నాయక్, బీహార్ మాజీ ముఖ్యమంత్రి కర్పూరీ ఠాకూర్. ఓబీసీల గొంతుకగా జీవితాంతం పోరాడిన ఆయన మండల్ కమిషన్ సిఫారసులకు ఆద్యుడు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీలకు 26 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కీలకపాత్ర పోషించారు. బీహార్‌లో 1.6 శాతం మాత్రమే జనాభా ఉన్న సామాజికవర్గంలో పుట్టినప్పటికీ రాష్ట్ర రాజకీయాలను శాసించిన జననాయక్ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారు. తన రాజకీయ జీవితంపై ఠాకూర్ ప్రభావం ఉందని నితీశ్ కుమార్ ఎప్పుడూ చెప్తుంటారు.

1977లో రెండోసారి ముఖ్యమంత్రిగా బీహార్లో జనతా పార్టీ ప్రభుత్వానికి నాయకత్వం వహించిన ఠాకూర్ 1978లో కొత్త రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు ప్రభుత్వ ఉద్యోగాలలో 24 శాతం కోటా ఉండగా, రాష్ట్రంలోని వెనుకబడిన తరగతులకు 26 శాతం రిజర్వేషన్లను కల్పించారు. ఈ రిజర్వేషన్లలో అనుబంధంగా అత్యంత వెనుకబడిన తరగతులకు 12 శాతం, తక్కువ వెనుకబడిన తరగతులకు 8శాతం, మహిళలకు 3 శాతం, ఆర్థికంగా వెనుకబడిన వారికి 3 శాతం రిజర్వేషన్లు కల్పించారు. ఈ రిజర్వేషన్ విధానమే 'కర్పూరీ ఠాకూర్ ఫార్ములా'గా ప్రసిద్ధి చెందింది.

1924 జనవరి 24న బీహార్‌లోని సమస్తిపూర్ జిల్లా పితౌజియా గ్రామంలో మంగలి (నాయి) కుటుంబంలో కర్పూరీ ఠాకూర్ జన్మించారు. 1938లో తన ఊరికి దగ్గరలో ప్రాంతీయ కిసాన్ సమ్మేళన్‌లో ప్రసంగించేందుకు వచ్చిన సోషలిస్ట్ ఆచార్య నరేంద్రదేవ్ దృష్టిలో పడ్డారు. తన ప్రసంగాలతో కాలక్రమేణా యువత, విద్యార్థులలో ఠాకూర్ ఆదరణ పొందారు. డిగ్రీ చదువుతుండగానే క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు జైలు శిక్ష అనుభవించారు. 1942 నుంచి 1945 వరకు జైలులో ఉన్నారు. బీఏ డిగ్రీ పూర్తి చేయకుండానే చదువు మానేశారు. ఆల్ ఇండియా స్టూడెంట్స్ ఫెడరేషన్‌లో చురుకైన సభ్యుడిగా ఉంటూ స్వగ్రామంలో యువజన కార్యకలాపాలను నిర్వహించారు. జైలులో ఉన్నప్పుడే కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీతో అనుబంధం పెంచుకున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత పార్టీకి పూర్తిగా అంకితం అయ్యారు. స్వాతంత్ర్యం వచ్చాక సోషలిస్టు ఉద్యమానికి నాయకత్వం వహించిన రామ్ మనోహర్ లోహియా, జయప్రకాష్ నారాయణ్‌ల ప్రేరణతో 1948లో కాంగ్రెస్ పార్టీని వదిలి సోషలిస్ట్ పార్టీలో చేరారు. లోహియా స్థాపించిన సంయుక్త సోషలిస్ట్ పార్టీకి అధ్యక్షుడిగా చాలా కాలం పని చేసి జీవిత చరమాంకం వరకు నిబద్ధత కలిగిన సోషలిస్టుగా కొనసాగారు. 1957లో ఆర్ఎల్ చందాపురి తన బీహార్ స్టేట్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ ఫెడరేషన్‌ను లోహియా సోషలిస్ట్ పార్టీలో విలీనం చేసిన తర్వాత, 1959లో లోహియా మద్దతుదారులు ప్రభుత్వ ఉద్యోగాలలో 60% రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానాన్ని ఆమోదించారు. దీంతో సోషలిస్ట్ రాజకీయాల ప్రధాన ఎజెండాగా రిజర్వేషన్ మారింది.

### నేడు ఠాకూర్ శత జయంతి

1960లో టాటా కంపెనీ కార్మికుల సమ్మెకి మద్దతు తెలిపారు. 1970 లో టెల్కో కార్మికుల ఉద్యమాన్ని నడిపి 28 రోజులు జైలు జీవితం గడిపారు. ఆమరణ నిరాహార దీక్ష చేశారు. అప్పుడే అతను జననాయక్‌గా పేరొందారు. 1952లో బీహార్ శాసనసభకు ఠాకూర్ ఎన్నికయ్యారు. అక్కడి నుంచి 1988 ఫిబ్రవరి 27లో మరణించే వరకు ఆయన రాజకీయాల్లో వెనుదిరిగి చూడలేదు. ఈ క్రమంలో 1970-1971లో మొదటిసారి,